గిరి ఉబ్బిన దవడను సరిచేసుకుంటున్నాడు! బాధలో కూడా వా డన్నాడు 'నా కెందుకు నీ మీద కోపం? ఇది మామూలేగా!' అని.

హాస్టలు సమీపిస్తున్న సమయాన గిరి పెదాలు...... దేన్నో ఉచ్ఛరించాయి—

"మనమంతా బానిసలం
గానుగలం, పీనుగలం
వెనుక దగా, ముందు దగా
కుడి యెడమల దగా దగా!"

ముగ్గురు మిత్రులూ హాస్టల్లో ప్రవేశించారు.

---

# అసమానంతర రేఖలు

బుచ్చిరామయ్య పేరు వినటంతోనే నాకు నవ్వొస్తుంది. కారణం ఆయన పేరే. కాని మరుక్షణంలో వచించేందుకు వలనుపడని ఉద్వేగం నా హృదయాన్ని చుట్టుముడుతుంది. దీనికి కారణం, ఆయన అనుసరించిన విధానం కావచ్చు.

♦ ♦ ♦ ♦

'ఈయన పేరు బుచ్చిరామయ్య' అని బెజవాడ గవర్నర్ పేట సెంటర్‌లో వెంకటేశ్వర్రావు ఆయన్ని పరిచయం చేసినప్పుడు నేను లోలోపల నవ్వుకున్నాను—'ఇదేం పేరు' అని. బహుశా ఈ బెజవాడపట్నంలోనే ఈయన ఏ

కో-ఆపరేటివ్ స్టోర్సులోనో, ఏ'విజయవాడ క్లాత్ ఎంపోరియం' లోనో ఒక గుమాస్తాగా పని చేస్తూవుంటాడని నా మెదడులో కల్పనల అల్లిక సాగిపోతూన్న సమయానికి వెంకటేశ్వరరావు మళ్ళీ అన్నాడు. 'బుచ్చిరామయ్య న్యూఢిల్లీలో మూడు వందల జీతంతో అసెంబ్లీరిపోర్టరుగా పనిచేస్తున్నాడని. నిజం చెప్పొద్దూ -ఒక్కసారిగా నా మనస్సుచుట్టూనిలుచున్న గోడలు 'ఢక్' మని పడిపోయాయి. నాలోని 'అహం' కాస్త దెబ్బతిన్నది. నా వ్యూహాల అల్లికకూ, ఈయన వాస్తవిక చిత్రానికీ ఎక్కడాపోలిక లేదు. నేను కొంచెం సిగ్గుపడి— ఈసారి బుచ్చిరామయ్యను కాస్త పరకాయించి చూశాను- ఆపాదమస్తకమూ. ఇరవైరెండో, ఇరవైమూడో సంవత్సరాల వయసుకలిగివుండి ఖాదీ పైజామా, ఖాదీ లాల్చీ, వేసుకొని చూడ్డానికి అందంగా కన్పించాడు. 'ఈ వయస్సునుంచే ఎంత సంపాదన!' అని అనుకుంటున్నప్పుడే — వెంకటేశ్వరరావు మళ్ళీ చెప్పాడు—'ఒక సహృదయుడైన తెలుగు పార్లమెంటు మెంబరు బుచ్చిరామయ్యకు ఈ ఉద్యోగమిప్పించాడు'. అని యీ విషయాలు విన్నాక—బుచ్చిరామయ్యమీద ఏదో తెలీని గౌరవం ఏర్పడింది—నాకు.

ముగ్గురం అన్సారీ పార్కులోకెళ్ళి సిమెంటు... బెంచీ మీద కూచుంటున్న సమయంలో వెంకటేశ్వర్రావు— బుచ్చిరామయ్యకు నన్ను పరిచయంచేశాడు-పేరుమధుసూధన రావనీ-కథలు రాసి పత్రికలకు పంపుతూఉంటాననీ-తనమిత్రు డనీనూ. మళ్ళీ అన్నాడు-'మన సంభాషణ ఆధారంచేసుకొనే ఒక కథ రాసి పత్రికలో ప్రచురితం చేయగలడుకూడా—'అని

యీ మాటలు నాకు వినబుద్ధికాలేదు. అంతవరకూ జరిగిన సంభాషణలో కధకు కావలసిన హంశం ఏదీ లేదు.

బుచ్చిరామయ్య...అప్పుడే బెంచీమీద కూచున్న నాపక్కకుజరిగి... ఇంగ్లీషులో...'మిమ్మ కలుసుకున్నందుకు చాలా సంతోషం...' అన్నాడు నవ్వుతూ. జవాబుగా నేనూ నవ్వి ఊరుకున్నాను.

బుచ్చిరామయ్య చెప్పుకుపోయాడు— "ఢిల్లీజీవితం చాలా హాయిగా వుంటుంది, ఎప్పుడూ ఏదోఒకసంరంభం... రాజఘాట్ దగ్గర గాంధీజీ స్మారకప్రార్ధన సమావేశాలో, రెడ్ఫోర్టులో కల్చరుమీదనో, భాషావిధానాలమీదనో పెద్ద పెద్ద సభలూ, కొత్తమంత్రుల నియామకసమయంలోనూ విదేశరాయబారులు మారిన సందర్భంలోనూ జరిగే పెద్దపెద్ద గవర్నమెంటు విందులూ—వినోదాలూ, చెప్పుకో తగినవి."

"రోజూ సాయంత్రపువేళలందు వలయాకారంగా నిర్మించబడిన 'కెనాట్ ప్లేస్' చుట్టుజుట్టి రావచ్చు! వివిధ వ్యక్తులు మనకు అక్కడ కనిపిస్తారు! ఆదివారం వచ్చిందంటే ఓఖలా ఆనకట్ట దగ్గరకో, కుతుబ్ మీనార్ దగ్గరికో వెళ్ళి కాలంగడుపుకోవచ్చు. వేసవిరావటం ఆలస్యం...అందరూ సిమ్లాచేరుకుంటారు...నిజం చెప్పాలంటే ఢిల్లీ మనదేశానికి గర్వకారణం!"

వెంకటేశ్వరరావు శ్రద్ధగా వినివిని ఆఖరున అన్నాడు-'బాగా డబ్బున్నవాళ్ళకూ, ఎక్కువజీతం సంపాయించేవాళ్ళకే ఢిల్లీ?'—అని.— యావత్తుభారత దేశానికే ఢిల్లీ నిరాశకు కారణమని చెబుదామనుకున్నా నేను. 'తినటానికి తిండీ, కట్టు

కోడానికి బట్టా, వుండేందుకు ఇల్లూ లేని ప్రతిసామాన్యుని దృష్టీ ఢిల్లీమీదనే వుంది. కాని ప్రభువులు పరాకును చిత్తగిస్తున్నారు.' అని నేను ఈసారికూడా ఆత్మగతంగానే అనుకున్నాను.

ఆపైన ఉభయులకూ ధన్యవాదాలుచెప్పి నాదారిన నేను వెళ్ళిపోయాను.

♦ ♦ ♦ ♦ ♦ ♦

ఇది సంఘటించి నాలుగుసంవత్సరాలు గడిచినా నా స్మృతిపథంలో ఎప్పుడూ కదుల్లాడుతుంది. ఈమధ్యలో ఎన్నో విషయాలు—జరిగిపోయాయి. నన్నొక మధ్యవర్తిగా ఎంచి ప్రతిదీ నాకు తెలియజేయటం — వెంకటేశ్వరావు ఎందుకు భావ్యమనుకున్నాడో నాకు తెలీదు. హృదయగతభావాలను ఎప్పటికప్పుడు బహిర్గతం చేసుకొని కొంత శాంతి చేకూర్చుకోవాలని అతను అభిలషించి వుండొచ్చు.

నేను మొదట్లో వెంకటేశ్వరావు—'నాపెళ్ళి బుచ్చిరామయ్య చెల్లెలితో కాబోతున్న'దని రాసినప్పుడు ఆశ్చర్యపడ్డాను. ఆఖద్దరుబట్టలాయనకూ వెంకటేశ్వరావుకు ఏంపోలిక?

వెంకటేశ్వరరావుకు మద్రాసులో ఉద్యోగం ప్యారీ అండ్ కోలో టైపిస్టు. జీతం వందరూపాయలు. 'ప్రతిదానిధరా పెచ్చు పెరిగి జీవితవిధానం హెచ్చుస్థాయిలోవున్న ఈరోజుల్లో వందరూపాయల జీతంతో మద్రాసులాంటి నగరంలో ఎలా జీవిస్తున్నావు' అని ఒకమారు అడిగినప్పుడు—'జీవించక చేసేదేమిటి'? అని మాత్రమే సమాధాన మిచ్చాడు. అతని పరిస్థితులకు పరిష్కారం ఏమిటో అతనికే తెలియదు.

నిరంతర ఆనందనిర్ఝరిలో తన్ను తాను విలీనంచేసుకోవాలంటే—ముందుగా బాధల్లో, కష్టాల్లో మునిగిపోవాలనీ, ఇప్పుడున్న దానికంటే విషమపరిస్థితులు బాధించనందుకు సంతోషపడాలని-అంటే కాలిలో ముల్లుగుచ్చుకుంటే కంటిలో గుచ్చుకోనందుకు సంతృప్తి పడాలని—అతని అభిమతమై వుంటుంది. 'నాజీవితానికి ఏదిదారి? ఈ కష్టాల్ని, దుఃఖాల్ని సహించటం ఎలాగ?' అని నిస్సబ్ధతకులోనుగాకుండా, అసంతృప్తితోకూడిన ఆలోచనల్ని మనసులో పరుగెత్తించనీయకుండా... తాత్కాలికోపశమనంకోసం తనకుతాను తీర్పు చెప్పుకున్నాడు. అందుకే చివరకు పెళ్ళిచేసుకుంటున్నాడు. పరిస్థితులు మార్పుకోసం మానవుడిముందు సమస్యల్ని ఏర్పరుస్తవి...ఆవేదనల నాటకపు ఆఖరు అంకంలో భరతవాక్యం పాడేందుకూ, గొంతులు కలిపేందుకూ వెంకటేశ్వరరావు నిర్ణయించుకున్నాడేమో!

'నేను పెళ్ళిజేసుకోబోతున్నానని' రాసినమనిషికి... 'నువ్వు జీవించలేవు ... చనిపోతావు ... నీ భార్యనుకూడా చంపటం దేనికి — మానుకో!' అని రాసి అతని ఆత్మవిశ్వాసానికి ఆఘాతం కలిగించటం భావ్యంకాదని...'చాలా సంతోషమైన విషయం! సరే, వస్తాను!' అని రాసి పంపించాను ఉత్తరం. కాని అనుకున్నాను— "వెంకటేశ్వరావ్! బుచ్చిరామయ్యా నీకు మిత్రుడు! ఇప్పుడు అతనిచెల్లెల్ని పెళ్ళాడి అతనికి బంధువుగా అయిపోతున్నావు. ఆ వెనుకటి మిత్రత్వం అడుగంటుతుంది. చివరకు మిగిలేది: మనస్పర్థలే!

వీటికి నీవు అతీతుడవయితేనే ముక్తి. లేకపోతే... అందరివలె ...'పెళ్ళికి నాకు ఉంగరం ఇవ్వలేదు... బట్టలు పెట్టలేదు... ఫలానా పండక్కి నన్ను తీసుకెళ్ళలేదు, ఆ బాపతు వంద రూపాయలు నాకు ముట్టలేదు. పార్కర్ కలం, ఒమేగా వాచీ, హంబరు బైక్ — వీటిలో ఏ ఒక్కటీ లభించలేదు... అని గొణగవలసివుంటుంది. దీంట్లో ఏ ఒక్కటి లోపించినా...... 'మేం మీా పిల్లనే తీసుకెళ్ళం!' అని బిర్రబిగిసి కూచోగానే... పిల్లతరఫువాళ్లు వాటిని అర్పించుకొని ఆడపిల్లను భర్తదగ్గరకు పంపటం...ఇలాంటి చాలా తంతులకు నువ్వు తావీయకుండా వుంటంలోనే నీ శ్రేయస్సు విహితమై వుంది. ఏదిఏమైనా స్నేహితుల చెల్లెళ్ళను పెళ్ళాట్టం చాలా అవివేకమైన పని!

బుచ్చిరామయ్య మూడు సంవత్సరాల క్రితమే ఇల్లూ వాకిలీ పొలం అమ్మేసి...తను పుట్టినవూళ్ళో ఏమీా లేకుండా చేశాడనీ, ఐదెకరాల పొలంమాత్రం తన మామగారివూళ్లో కొన్నాడని, ఆ పొలమీాది అజమాయిషీ తనమామగారిదేననీ, ప్రతిసంవత్సరం పంటతాలూకు డబ్బు ఢిల్లీపంపుతూవుంటాడనీ తెలిసింది.

ఎప్పుడైనా ఢిల్లీనుంచి వస్తే గిస్తే తన మామగారి వూరువచ్చి — తల్లీతండ్రీ పోయినప్పటినుంచీ తనేపోషిస్తూ, చదువుచెప్పిస్తూన్న చెల్లెలిని చూచి తన మామగారితో... 'కాస్త కనిపెట్టి వుండండి ... పెళ్ళయేదాకా' అని చెప్పి వెళ్తూంటాడని వినికిడి. ఒకసారి బెజవాడ స్టేషనులో ఎవరో

... 'ఎందుకు నీ చెల్లెల్ని పరాయి పంచన వుంచటం ? నీతోపాటే... ఉన్నదేదో తింటుంది...... ఢిల్లీ తీసుకెళ్ళలేక పోయావా ?' అంటే 'న్యూఢిల్లీ సొసైటీ...మీకు తెలీదు... ఐదోతరగతి చదువుకున్న మా పల్లెటూరి చెల్లెలు అక్కడ పనికిరాదు !'' అని సమాధానం చెప్పాట్ట !

బుచ్చిరామయ్య తన చెల్లెలి పెళ్ళి... తన మామగారి ఇంటిదగ్గరే చేశాడు ! పెళ్ళిలో ఆయనకేమీ ఖర్చుకాలేదుట! పెళ్ళిచూస్తేనేమో పూలదండల పెళ్ళి. చుట్టాలా ఎక్కువ రాలేదు ! ఇక వెంకటేశ్వరరావుకుమాత్రం ఎవరున్నారు ? అతనూ తల్లీ తండ్రీలేని అనాధుడే. ఆ వున్న అన్నా, ఆయన భార్యా పిల్లలూ వచ్చారు. అంతే ! ఇచ్చిపుచ్చుకోటాల్ని గూర్చి ఎవరూ ఎలాంటి ప్రస్తావనా తీసుకురాలేదు. చివరకు బుచ్చిరామయ్యే ఒక ఎకరం... ఇస్తానని చెప్పించాడు.

పెళ్ళిలో బుచ్చిరామయ్య స్నేహితుల్ని చూట్టం తటస్థించింది. వాళ్ళుకూడా న్యూఢిల్లీ సొసైటీనుంచి దిగివచ్చారేమోననే అనుమానం కలిగింది.

బుచ్చిరామయ్య భార్య...ఈ పెళ్ళిభారమంతా తనదేనన్నట్లుగా హడావిడిచేస్తోంది. ప్రతివాళ్ళదగ్గరకూవచ్చి.... 'ఏమండీ బావున్నారా ?' అని వాళ్ళ ఉద్యోగాల్ని గూర్చి, వివరాలడుగుతోంది. కొంతమంది... 'ఏమండీ ! ఢిల్లీవిశేషాలేమిటి ? నెహ్రూగార్నీ, రాజేంద్రప్రసాద్‌నూ రోజూ చూస్తూనేవుంటారు. ఎప్పుడన్నా ఆగ్రావెళ్ళి తాజ్‌మహల్ చూచివచ్చారా ? కాశ్మీర్ ఎంతదూరం అక్కడికి ?– అని ప్రశ్నలవర్షం కురిపిస్తుంటే అందరికీ సమాధానాలు చెప్పేసింది.

బుచ్చిరామయ్యభార్య... బాగా చదువుకున్నదేననీ; ఆమెకూడా ఢిల్లీలో 'ఉమెన్స్ వెల్ఫేర్ సెంటర్' లో పని చేస్తున్నదని తెలుసుకున్నాను. పంజాబీలా తలదువ్వి రెండు జడలేసుకొని......చాలా విలువైనచీర ధరించివుంది. అందమైన మనిషి.

♦ ♦ ♦ ♦

"పెరంబూరులో పాతికరూపాయలకు ఇల్లు తీసుకొని రోజూ 'లోకల్ ట్రియిన్'లో వచ్చి......సాయంత్రానికల్లా మళ్ళా వెళ్ళిపోతున్నాను. సిటీలో ఇళ్లు దొరకటం చాలా దుర్లభం— తక్కువ రెంట్‌లో. కంపెనీవాళ్లు ఫేమిలీ అలవెన్సుకింద ఈ నెలనుంచి ఐదురూపాయలు పెంచారు. నిజం చెప్పాలంటే... ఇంగ్లీషువాళ్ళేనయం మన ఇండియన్స్ కంటె. ఒక జాతీయసంస్థలో సంవత్సరం పనిచేశాను. నెలకు 75 రూ. జీతంమీద కాని అక్కడ తెలుగు అరవఫీలింగ్స్! సంవత్సరం పనిచేసినా కానీ పెంచలేదు. అలాంటి బాధలేమీ లేవు - ఇక్కడ. మొహాన్ని చూచీ, జాతినిచూచీ, ప్రాయాన్ని చూచి...డబ్బుతగ్గించటం హెచ్చించటంలేదు... ఈ కంపెనీ అధికారులు చూచేది కేవలం పని.

ఈ జీతం- అస్తుబిస్తుగా సరిపోతుంది. ఇంతకంటే చేసేదేముంది ?" అని మద్రాసులో కాపురంపెట్టిన నెలరోజుల తరువాత వెంకటేశ్వరావు లేఖమూలంగా తెలియజేశాడు.

పాపం! వెంకటేశ్వరావు ఒకరకంగా జీవించాలంటే... ఆ వచ్చే జీతం సరిపోదు. తనభార్య ఎకరం పంట తాలూకు

డబ్బు మహావస్తే 150 రూ. లు వస్తాయి. అవి ఆవిడ బట్టలకు సరిపోతాయో లేదో. వెంకటేశ్వర్రావు ఆ చినిగిపోయిన గుడ్డలతో కాలం గడపాల్సిందే. మళ్ళీ పిల్లలు పుట్టటం మొదలెడితే... వెంకటేశ్వర్రావు ఈ సంసారజీవితాన్ని ఎలా నెట్టుకుపోగలడో! అసంఖ్యాకంగా యిలాంటి వెంకటేశ్వర్రావులు ఈ దేశం నలుమూలలా పురుగుల్లాగా జీవిస్తూంటే ఈ దేశ పరిపాలకులు మౌనాన్ని వహించివుండటం క్షమించరాని విషయం !

ఆరు నెలల వైవాహిక జీవితానంతరం...... అతను రాసుకున్న దీర్ఘ లేఖ ఇది—

'మొదటి నెల ఎలాగో జరిగిపోయింది. కాని రెండో నెలనుంచి సరీగా సరిపోయేది కాదు - నాకొచ్చే జీతం. ఆఖరుకు ... ఏమీ చేసేదిలేక బుచ్చిరామయ్యకు లేఖ వ్రాశాను... 'వీలుంటే కొంత డబ్బూ, మీ చెల్లెలికి ఒకటి రెండు చీరెలూ పంపించవలసింది' అని. దానికి సమాధానంగా బుచ్చిరామయ్య భార్య ఇలా రాసింది.

"అబ్బాయీ! నీ ఉత్తరం అందింది. సమాధానం నేనే రాస్తున్నా. ఆయన పార్లమెంటురిపోర్టింగ్ పనిలో వున్నారు. యీ ఉత్తరం ఆయనకు చూపించివుంటే సమాధానంకూడా ఇచ్చివుండేవారుకాదు.

"పెళ్ళి చేసుకున్నాక—భార్యను సంరక్షించాల్సిన పద్ధతులుకూడా తెలుసుకొని వుండాలి. పోయిన పొడుగూ క్షేమం మాత్రం ఎలా పెట్టగలం?

"బహుశా మేం ఇద్దరం కలిసి నాలుగొందల పైచిలుకు సంపాయిస్తున్నాంగదా, డబ్బుమూలుగుతూవుందనినీవుద్దేశ్యం. నాడబ్బుమాత్రం నేను బ్యాంక్‌లో వేసుకోవాల్సిందే. ఆయన కొచ్చే డబ్బు సరిపోయీ సరిపోకుండా వుంటుంది. ఈ ఢిల్లీ సంగతి నీకేం తెలుసు? శిష్టాచారాలకే చాలడబ్బు ఖర్చవుతుంది. ఇలాంటప్పుడు మీకేం పంపించగలం?

"ఇకపోతే చీరలవిషయం: అనగూడదుగాని, నీభార్య పల్లెటూరిపిల్ల. నిజం చెప్పమంటే: ఒకటి రెండు పర్యాయాలు నేను ఢిల్లీనుంచి వచ్చినప్పుడు నా చీరెలు, నా జాకెట్లూ, నా తలదువ్వుకునే సామాన్లూచూచి—కుళ్ళి కుళ్ళి ఏడ్చింది 'రెండు పెట్టెల చీరెలూ, రెండు పెట్టెల జాకెట్లూ ఎందుకు వదినా!' అని ఆఖరకు నన్ను ప్రశ్నించిందికూడా. న్యూఢిల్లీ ఎటికెట్టునుగూర్చి ఆమెకుచెప్పి మాత్రం ఏంప్రయోజనం? అర్థమైతేగా మానవురాలికి !

"నిన్నొక్కటి అడుగుతాను—ఏమీ అనుకోకు. నువ్వు నీ భార్యకు ఒకచీరెకూడా కొనిపెట్టేస్థితిలో లేవూ? ఇలాటప్పుడు పెళ్ళి ఎలా చేసుకున్నావయ్యా బాబూ? అయినా ఆమెకు ఇప్పుడున్న చీరెలు పనికిరావ ఏమిటి? పెళ్ళినాటిచీరెలు ఆరు నెలలకే చిరిగిపోయాయా? అయినా ఆ అమ్మాయికి చీరెలు వాడుకోవటం తెలీదులే.

"నే నిలా రాసినందుకు ఏమీ అనుకోకు. ఇక ముందెప్పుడూ, డబ్బునుగూర్చి మాకు రాయకుండా...నీ కొచ్చే జీతాన్ని జాగ్రత్తగా వాడుకుంటూ— నీ మీద నువ్వే ఆధారపడేట్టుగా పరిస్థితుల్ని సృష్టించుకో ! ఇంతే—"

మూడురోజుల తరువాత మరో లేఖ బుచ్చిరామయ్య దగ్గర్నుంచి వచ్చింది.

"వెంకటేశ్వర్రావుకు. నీవు లేఖ వ్రాశావని ...... సుగుణ చెప్పింది, ఈరోజే. మీ జీవితం చాలా హాయిగా వుందనీ, సూర్యుడుమునిగే సాయంత్రపు మద్రాసుసముద్రం, ఆదివారంనాటి మెరీనా సౌందర్యం, నల్లటి ప్లాస్టిక్ లాంటి మౌంట్‌రోడ్ నిగనిగలు— మీ ఉభయుల అంతరంగాల్లో ఆనందాన్ని ప్రవహింపచేస్తున్నాయనీ సుగుణద్వారా తెలుసుకొని చాలా సంతోషించాను. మీ ఉభయుల ఆనందమే నా ఆనందం!

మా చెల్లి తల్లి లేనిపిల్ల. అంతగా చదువుకున్నదికూడా కాదు ఆమెను నీ కనుగుణంగా తర్ఫీదుచేసుకో. ఏమైనా డబ్బు కావలసివుంటే నాకు వ్రాయి పంపిస్తాను.

పనితొందరవలన నేను వెంటనే ఉత్తరం రాయలేక పోయాను. దీన్నిప్పుడు ఆఫీసునుంచే రాస్తున్నాను ఎలాగో వీలుచూచుకొని. ఇంతే."

ఆ తరువాత ఎప్పుడూకూడా నేను బుచ్చిరామయ్యకు లేఖ వ్రాయలేదు. వెంకటేశ్వర్రావు."

♦ ♦ ♦ ♦

పెళ్ళి చేసుకున్న సంవత్సరానికే... వెంకటేశ్వర్రావు లాగా ఎంతమంది యిలాంటి కష్టాల్లో - దుఃఖాల్లో మునిగి కృశించిపోతున్నారోనని - వెంకటేశ్వర్రావుఉత్తరంవచ్చిన రోజున చాలాసార్లు అనుకొని విచారించాను. ఇంతకంటే చేసేదేముంది!

'ప్రియమధూ! ఈ ఉత్తరం రాయటానికి నాకు చేతులాట్టంలేదు. కాని నీకు తెలియజేయకుండా వుండలేను.

నా భార్య బుచ్చిరామయ్యకు తెలియజేసింది. 'నువ్వు నాకు చీరెలు పంపనవసరంలేదు. డాక్టరు రాసియిచ్చిన మందులకు డబ్బు పంపించు. షుమారు వందకులోపు' అని ఆయన నాకు రాశాడు సమాధానం— "ఏమయ్యా. సినిమాలకూ, బీచ్ షికార్లకూ వెళ్ళి డబ్బు తగలేసుకునేకంటే ...దాన్ని నిలువజేసుకోగూడదూ? మనిషి అన్న తరువాత పడిసెమో, తలనొప్పో వస్తూనే వుంటాయి. వీటికోసం ఏ కొంచెమైనా నిలువజేసుకోటం— చాలాఅవసరం. ప్రస్తుతం నా దగ్గరేమీలేదు...ఒక తెలుగుమిత్రుడు అవసరమంటే— రెండురోజులక్రితమే నాలుగొందలు సర్దాను. అక్కడే ఎవరినైనా మిత్రుల్ని అడిగి తీసుకొని మందులుకొను."—అని.

"ఆ తరువాత నేను మందులు కొనలేకపోయాను. అప్పటికే కంపెనీలో నందకుపైగా అడ్వాన్సుగాతీసుకున్నాను. మిత్రులు ఐదూ పదీ సర్దగలరుగాని వందరూపాయలంటే... ఏంజూచి నాకిస్తారు? పంటడబ్బుకోసం రాయమన్నది నా భార్య. అప్పుడే ఏం పంటడబ్బు! మా అన్నయ్యను చూడబోతే నలుగురు పిల్లలూ ఆయనా...ఏమీ వుండదు. మందులు కొనలేదు.

"ఆ తరువాత మూన్నెల్లకు బుచ్చిరామయ్య ఉత్తరం వ్రాస్తూ... మా చెల్లి ప్రసవించగనే ఉత్తరం రాయవలసిందనీ, తల్లిలేనిపిల్ల గనుక కాస్త జాగ్రత్తగా చూచుకోవలసిందనీ, కావలిస్తే డబ్బు పంపగలననీ ...... తెలియజేశాడు.

పార్లమెంట్ సెషన్స్ జరుగుతున్నందున తాను చాలా బిజీగా వున్నానని సూచించాడు.

"ఆ ఉత్తరం అందిన వారం రోజులకే ప్రసవవేదనతో బాధపడి......ఆఖరికి ఈ లోకాన్నే వదలి వెళ్ళిపోయింది. నాకు వెలుగుచూపే నా జీవనతార రాలిపోయింది. నా జీవన సర్వస్వం... ఈ వాయువులో కలిసిపోయింది. సానుభూతి వచనాలను... టెలిగ్రాండ్వారా పంపించారు...బుచ్చిరామయ్యా, సుగుణా

"ఇంతే, మళ్ళీ నా బ్రతుకు యథావిధిగానే వుంది. అలాగే జీవిస్తున్నాను. ఇంతకంటే చేసేదేముంది ?— వెంకటేశ్వర్రావు"

♦ ♦ ♦

ఇకమళ్ళా వెంకటేశ్వర్రావు, బుచ్చిరామయ్యా కలసి బెజవాడ గవర్నర్పేట సెంటరులో కన్పించరు. వాళ్ళిద్దరి మధ్యా ఉత్తర ప్రత్యుత్తరాలు జరగవు. బుచ్చిరామయ్యా... 'మాచెల్లి తల్లిలేనిపిల్ల. ఏమీ చదువుకున్నదికాదు, కాస్త జాగ్రతగా చూచుకో' అని రాయాల్సిన అవసరంలేదు. వెంకటేశ్వర్రావు...తన అవసరాల్ని ఏకరువుబెడుతూ డబ్బుకు రాయడు. ఇప్పుడు వాళ్ళిద్దరూ బంధువులుకాదు. మిత్రులంతకంటెకాదు. ఇప్పుడు సుగుణ ఎవరోగూడా తెలీదు. బహుశా వెంకటేశ్వర్రావుకు ఇప్పుడు మిత్రులమీద నమ్మకం తగ్గిపోయి వుంటుంది. సామాన్యుని జీవితాన్ని కృంగదీస్తున్న నేటి నల్లదొరల పరిపాలనయెడల వెంకటేశ్వర్రావు పళ్ళు పటపట కొరుకుతూవుంటాడు!

వెంకటేశ్వర్రావుజీవిస్తున్నాడు..అదేఅతనుచేయగల్గింది!